నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, మంగళవారం 3 డిసెంబర్ 2024 | HANUMAKONDA

తొర్రూరులో గురుకుల పాఠశాల గేట్ ఎదుట కూర్చొని నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

గురుకులాల గేట్లకు తాళాలు

- పరిశీలనకు వెళ్లిన బీఆర్ఎస్, విద్యార్థి సంఘం నాయకులకు అనుమతి నిరాకరణ
- గేట్ల ఎదుటే కూర్చొని నిరసన

తొర్రూరు, డిసెంబర్2: గురుకులాల గేట్లకు తాళాలు వెక్కిరించాయి. సోమవారం తొర్రూరులోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కేజీబీవీల్లో వసతుల పరిశీలనకు వెళ్లిన బీఆర్ఎస్, విద్యార్థి సంఘం నాయకులకు అధికారులు అనుమతి నిరాకరించారు. దీంతో గేట్ల ఎదుటే కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 48 మంది విద్యార్థులు చనిపోవడం దురదృష్టకరమని అన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కళాశాలలపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని మండిపడ్డారు. పేద విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి వెళ్లిన ప్రతినిధి బృందాన్ని అడ్డుకుంటారా?, ఉన్న తాధికారుల అనుమతి లేనిదే లోపలికి రానివ్వమనడం వారికి విద్యార్థులపై ఉన్న అశ్రద్ధకు నిదర్శనమన్నారు. హాస్టళ్ల పరిశీలనకు వెళ్తే గేట్లకు తాళం వేసుకొన్న తీరు రేవంత్ రెడ్డి సర్కారు నిరంకుశత్వ పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడు రాజేశ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాస రావు, మండల పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యుడు ఎస్కే అంకూస్, కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కల్వకొలను జనార్దన్ రాజు, బీఆర్ఎస్ నాయకులు ధరావత్ జై సింగ్, కౌన్సిలర్ గుగులోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు దావా ప్రతిని సర్వే అధికారులకు చూపిస్తున్న రైతులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వే అడ్డగింత

- హైకోర్టు దావా ప్రతిని చూపించిన రైతులు
- సరైన నష్టపరిహారం ఇవ్వడం లేదని న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వెల్లడి
- వెనుదిరిగిన అధికారులు

సంగెం, డిసెంబర్2: సంగెం శివారులో గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వేను సోమవారం రైతులు అడ్డుకున్నారు. అధికారులు ప్రశ్నించడంతో తమ విలువైన భూములను కోల్పోతున్నామని, ప్రభుత్వం సరైన నష్టపరిహారం ఇవ్వడం లేదని తాము హైకోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. హైకోర్టు దావా ప్రతిని అందించడంతో అధికారులు తిరుగుముఖం పట్టారు. రైతులు దానం అశోక్, సరిత, యాకయ్య, సురేశ్‌కుమార్, శంకరయ్య, నూర రాధిక, కనకం రాజు, ఛాయాసుందరి, నూర శ్రీనివాస్, సోల మల్లికార్జున్, నర్సయ్య, మహేందర్, కంచం అయిలయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి దస్రూనాయక్, తదితరులు

రాష్ట్రస్థాయి బాలికల బాక్సింగ్ పోటీలు ప్రారంభం

- ఉమ్మడి 10 జిల్లాల నుంచి పాల్గొన్న 150 మంది క్రీడాకారిణులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 2 : హనుమకొండ జేఎన్ఎస్‌లోని బాక్సింగ్‌హాల్‌లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బాలికల అండర్-17, 19 తెలంగాణ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పోటీలు హోరాహోరీగా జరిగాయి. మూడురోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో ఉమ్మడి 10 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారిణులు, కోచ్, మేనేజర్స్ పాల్గొన్నట్లు స్టేట్ బాక్సింగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, సీనియర్ బాక్సర్ శీలం పార్థసారథి తెలిపారు. వీరికి హనుమకొండ ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో భోజన తదితర సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వరంగల్ బాక్సింగ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చాడ సుభాష్ రెడ్డి, ఏఈ శ్యాంప్రసాద్, ఎస్జీఎఫ్ హనుమకొండ సెక్రటరీ దస్రూనాయక్, టీజీపీఈటీఏ స్టేట్ సెక్రటరీ బోగి సుధాకర్, టీజీపీఈటీఏ వరంగల్ ప్రెసిడెంట్ గోగు నారాయణ, ఒలింపిక్ అసోసియేషన్ వరంగల్ మాజీ సెక్రటరీ మంచాల స్వామిచరణ్, బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పోతరాజు రాజేందర్, బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ పెద్దమ్మ నర్సింహరాములు, హనుమకొండ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం శీలం రాజేశ్వరి పాల్గొన్నారు.

జూపార్క్‌కు కరీనా-శంకర్

- జంతుప్రదర్శనశాలకు చేరిన పెద్దపులి జంట
- హైదరాబాద్ నెహ్రూ జూ నుంచి తీసుకొచ్చిన అటవీశాఖ అధికారులు
- త్వరలో సందర్శకుల ముందుకు వచ్చే అవకాశం

కరీనా (ఆడ పులి)

శంకర్ (మగ పులి)

సుబేదారి, డిసెంబర్2: హనుమకొండలోని హంటర్‌రోడ్డులో ఉన్న కాకతీయ జూపార్క్‌కు పెద్ద పులి జంట వచ్చిందోచ్. ఇక కరీనా-శంకర్ జంటను కనులారా చూసి ఆనందించవచ్చు. టైగర్ కపుల్స్ రావడంతో జంతుప్రదర్శనశాలకు న్యూ లుక్ వచ్చింది. ఇంతకాలంగా వరంగల్ జూపార్క్‌కు పెద్ద పులిని తీసుకురావాలని అటవీశాఖ అధికారులు చేసిన ప్రయత్నాలు ఇప్పుడు సఫలీకృతమయ్యాయి. ఆరేళ్ల క్రితమే తెలంగాణ అటవీశాఖ తరపున హంటర్‌రోడ్డు జూపార్కులో స్రవంతి, దేవా చిరుత పులులను తీసుకొచ్చారు. దీంతో జూపార్క్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. కొత్తగా రెండు పెద్ద పులులను జిల్లా అటవీశాఖ అధికారులు హైదరాబాద్ నెహ్రూ జూపార్కు నుంచి ప్రత్యేక బోను ఉన్న వాహనంలో తీసుకొచ్చారు.

త్వరలో సందర్శకుల ముందుకు..

హంటర్‌రోడ్డు కాకతీయ జూపార్కుకు వచ్చిన కరీనా-శంకర్ కపుల్స్ రెండు, మూడు రోజుల్లో సందర్శకుల ముందుకు రానున్నాయి. ఇందుకోసం రెండింటికి వేర్వేరుగా బోనులు తయారుచేశారు. మంగళవారం లేదా బుధవారం అధికారికంగా టైగర్స్‌ను సందర్శకుల ముందుకు తీసుకురావడానికి అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటికోసం ప్రత్యేకంగా డే షెల్టర్, రాత్రివేళ వాటికి రక్షణగా నైట్ షెల్టర్‌ను తయారు చేస్తున్నారు. వీటి పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా హైదరాబాద్ జూపార్క్‌నుంచి ఇద్దరు ట్రైనర్స్‌ను తీసుకొచ్చారు. టైగర్స్ జంట రాకతో జూపార్కుకు సందర్శకుల తాకిడి మరింత పెరుగనున్నది. ఇప్పటికే సెలవు దినాల్లో కిక్కిరిసిపోతుండగా, ఇకనుంచి టైగర్స్ జంటను చూడడానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సందర్శకులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉంది.

అంతా గందరగోళం..

టేకుమట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నది. బ్యాంకులో లిస్టు తీసుకుని సక్కగ మాఫీ చేయకుండా అనేక కొర్రీలు పెడుతూ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం బాధాకరం. నిరుపేద రైతులకు రుణమాఫీ చేయ కుండా, రైతుబంధు డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేస్తున్నది. పెళ్లిళ్లు జరిగి వేరు పడ్డ రైతులకు రేషన్ కార్డులు ఒకటే ఉన్నాయి. వారు వేర్వేరుగా తీసుకున్న అప్పులను తండ్రి కొడుకులవి కలిపి రూ. 2లక్షల పైన ఉన్నాయని సాకు చెప్పి మాఫీ చేయకపోవడం మాట తప్పడమే అవుతుంది. రైతులందరికీ వెంటనే రూ. 2లక్షల వరకు మాఫీ చేయాలి.

– కూర సురేందర్‌రెడ్డి, వెల్లంపల్లి, టేకుమట్ల

ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటున్నరు

చెన్నారావుపేట: అధికారులు అడిగిన అన్ని పత్రాలు ఇచ్చినా మాఫీ కాలేదంటున్రు. నేను తీసుకున్న అప్పు మొత్తం రూ. రెండు లక్షల లోపే ఉన్నది. సొసైటీ వాళ్లు చేసిన తప్పులకు రైతులను ఇబ్బంది పెడుతున్నరు. చెప్పినట్లు రైతులందరికీ మాఫీ చేయాలే గాని ఇలా తిరకాసులు పెట్టి ఆఫీసుల చుట్టూ తిప్పుకునుడు మంచిగ లేదు. ఆధార్ తప్పు ఉన్నదని సరిచేస్తామని ఇన్ని రోజులు తిప్పిండ్లు. పానం బాగా లేకపోయినా మా పిలగాన్ని పట్టుకొని వాళ్లు అడిగిన పేపర్లు అన్ని ఇచ్చినం. అయినా మాఫీ కాలేదంటున్నరు. ఇప్పుడు అడిగితే ఖాతాలు చెక్ చేయాలని చెబుతు న్నరు. అసలు వస్తుందా లేదా తెలియడం లేదు. మాలాంటి వాళ్లను మోసం చేయడం మంచిది కాదు.

– బోడ ఈరమ్మ, రైతు, చెన్నారావుపేట

ప్రభుత్వంపై నమ్మకం పోయింది

సబర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తుందనే నమ్మకం పోయింది. నాకు రెండు ఎకరాల 39 గుంటల వ్యవసాయ భూమి ఉంది. కమలాపూర్ యూబీఐలో రూ. రెండు లక్షల క్రాప్ లోన్ తీసుకున్న. నాలుగు విడతలు రుణమాఫీ చేసినా మాఫీ కాలేదు. రూ. రెండు లక్షలలోపు ఉంటేనే మాఫీ వర్తిస్తుందని మంత్రులు, అధికారులు చెప్పడంతో కట్టిన. అయినప్పటికీ మాఫీ కాలేదు. నా తండ్రి గట్టుమల్లు పేరుతో రూ. లక్ష, కొడుకు సుమంత్ పేరుతో రూ. లక్ష క్రాప్‌లోన్ తీసుకున్న. ముగ్గురికి కలిపి ఒకే రేషన్ కార్డు ఉండగా ఒకరికే మాఫీ వస్తుందని అధికారులు చెప్పుతున్నరు. అయినప్పటికీ మా కుటుంబంలో ఎవరికీ మాఫీ కాలేదు. రుణమాఫీ రూ. 2లక్షలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. గత ప్రభుత్వంలో మాఫీ అయిన రైతులకే ఇప్పుడు మాఫీ అయింది.

– ఎల్లబోయిన సారయ్య, రైతు, దేశరాజ్‌పల్లి, కమలాపూర్

కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరిట మరోసారి రైతులను వంచించింది. చివరి విడతలోనూ వేలాది మందికి మొండిచేయి చూపింది. చివరి జాబితాలో తమ పేరుంటుందని ఆశపడిన అన్నదాతలను నిండా ముంచింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు విడతల్లోనూ 50 శాతం లోపు రైతులకే మాఫీ చేసిన సర్కారు నాలుగో విడతలోనూ మాయ చేసింది. అన్ని అర్హతలుండి మాఫీ కాక ఆందోళనకు దిగిన రైతుల నుంచి వివరాలు సేకరించిన ప్రభుత్వం ఇందులోనూ సగం మందికే అమలు చేసింది. దీంతో రైతులు రాష్ట్ర సర్కారుపై మండిపడుతున్నారు. రుణమాఫీ పూర్తయ్యిందని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక కారణాలతో మాఫీ కాలేదని తమ నుంచి అన్ని వివరాలు, సెల్ఫీలు తీసుకొని మాఫీ ఎగ్గొట్టారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారుల వద్దకు వెళ్లి తమకెందుకు మాఫీ కాలేదంటూ నిలదీస్తున్నారు. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. - హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 2

ఫాటో దిగొచ్చినా మాఫీ కాలేదట..

నేను మా ఊరి బ్యాంకులో పోయినేడు పంట పెట్టుబడి కోసం రూ. 25 వేలు అప్పుగా తీసుకున్న. మొన్న ఎన్నికల ప్పుడు సర్కారు పెట్టుబడి కోసం తీసుకున్న అప్పులను మాఫీ చేస్తామంటే మస్తు సంబురపడ్డ. రూ. 25 వేలు అప్పు పోయినట్టే అనుకున్న. నాకు బియ్యం కార్డులేదని మాఫీ కాలేదట. అటెంక ఎవుసం ఆఫీసుకు తీసుకుపోయి సార్లు ఫొటోలు తీసుకున్నరు. నీకు మాఫీ అయి తది పో అని చెప్పిండ్లు. నిన్ననే కొందరికి మాఫీ అయ్యిందని చెబితే ఆధార్‌కారటు తీసుకునిపోయి ఏవో సార్ దగ్గర చూపెట్టిన. అచ్చినోల్లల్ల నీ పేరు లేదన్నరు. మళ్లొత్తే సూద్దామని చెప్పి పంపించిండ్రు.

– కొన్నె కనుకమ్మ, మహిళా రైతు, ఎల్కతుర్తి



- సగం మందికి కూడా వర్తించని రుణమాఫీ
- మాఫీ పూర్తయ్యిందన్న సీఎంపై అన్నదాతల ఆగ్రహం
- ఏవోలతో సెల్ఫీలు దిగినా అన్యాయం చేసిండ్రని ఆందోళన
- ఇంత నమ్మకద్రోహం ఎన్నడూ చూడలేదని ఆవేదన
- నిరాశలో రూ.2లక్షల పైచిలుకు రుణం ఉన్న రైతులు

చివరి విడతలోనూ రైతులకు మొండిచేయి

మరోసారి వంచన

ఇంకా డబ్బులు పడలే..

చిట్యాల : నాకు మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో రూ.50వేల క్రాప్ లోన్ ఉంది. మొదటి విడతలో రుణ మాఫీ కాలేదు. ఎందుకని అధికారుల దగ్గరికి పోతే బ్యాంకు, ఆధార్ కార్డులో పేర్లు వేరే ఉన్నాయని రుణమాఫీ ఆగినట్లు చెప్పిన్రు. రెండు, మూడో విడతల్లో కూడా డబ్బులు జమ కాలేదు. నాలుగో విడతలో అందరికీ రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పిండు.అయినా ఇంతవరకు డబ్బులు పడలే.

– కన్నవేణి రాయకొమురు, చిట్యాల

డబ్బులు పడుతయని ఎదురుచూస్తున్న..

దామెర: నేను మా ఊరిలోని ఏపీజీవీ బ్యాంకులో రూ. లక్షా 95 వేల రుణం తీసుకున్న. ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తమని చెప్పి ఇప్పటి వరకు చేయలేదు. బ్యాంకు చుట్టూ తిరుగుతున్న. ఎన్నికలకు ముందు రైతులకు రూ. రెండు లక్షల వరకు రుణాలను మాఫీ చేస్తా మని హామీ ఇచ్చి ఏడాదవుతున్నా రుణమాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే మాకు తెలియదని దాటవేస్తున్నరు. డబ్బులు పడుతయని ఎదురుచూస్తున్న. ప్రభుత్వం వెంటనే రుణ మాఫీ చేసి ఆదుకోవాలి.

– ఒడిబోలు మల్లయ్య, రైతు, ఊరుగొండ, దామెర

హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 2 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ అంతా మాయేనంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటి, రెండు, మూడో విడతల్లో రుణమాఫీ జరగక వేలాది మంది అన్నదాతలకు నిరాశే ఎదురైంది. అనేక కారణాలతో మాఫీ నిలిపివేయడంతో రైతులు ఆందోళనకు దిగడంతో దిగొచ్చిన ప్రభుత్వం కుటుంబ గుర్తింపు, రేషన్ కార్డు, ఇతర కారణాల నివృత్తి కోసం ఆయా వ్యవసాయ క్లస్టర్లకు వెళ్లి ఏవోలతో సెల్ఫీలు దిగి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని ప్రకటించింది. దీంతో వారంతా ఆయా క్లస్టర్ల వెళ్లి తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న అనేక మంది వివరాలు నమోదు చేసుకోలేకపోయారు. దీనికి తోడు బ్యాంకు, ఆధార్‌లో పేర్లు తప్పుగా ఉన్న వారు సైతం తమ పూర్తి సమాచారాన్ని అధికారులకు అందజేశారు. పైగా అయితే వ్యవసాయాధికారుల తప్పిదమో, లేక సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో తప్పిదమో కానీ అనేక మంది రైతుల వివరాలు సాంకేతికంగా నమోదు కానట్లుగా తెలుస్తున్నది. ఈ కారణంగా 50 శాతం మంది రైతులకు కూడా మాఫీ జరగలేదని క్షేత్రస్థాయిలో వెల్లడవుతున్నది. పైగా రూ. 2 లక్షలకు పైనున్న డబ్బులు బ్యాంకులో జమచేస్తే మిగిలిన రుణాన్ని మాఫీ చేస్తామన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాటలు నమ్మిన రైతులు వాటిని చెల్లించారు. వీరికి కూడా చివరి విడతలో మాఫీ కాకపోవడంతో నిరాశలో మునిగిపోయారు. హనుమకొండ జిల్లాలోని అన్ని క్లస్టర్లలోకలిపి 6,760 మంది రైతులు తమ వివరాలను నమోదు చేసుకోగా అందులో సగం మందికి కూడా మాఫీ జరగనట్లు సమాచారం. అయితే ఈ విషయమై వ్యవసాయాధికారుల్లో కూడా గందరగోళం నెలకొంది. నిర్దిష్టంగా ఇంత మంది రైతులకు రుణమాఫీ జరిగిందని చెప్పలేకపోతున్నారు. దీంతో చివరి విడతలోనైనా తమ పేరుంటుందని ఆశగా ఎదురుచూస్తున్న రైతులు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారుల వద్దకు వెళ్లి తాము అన్ని వివరాలు సమర్పించినా ఎందుకు మాఫీ కాలేదని నిలదీస్తున్నారు. దొంగ హామీలిచ్చి తమను సీఎం రేవంత్‌రెడ్డి వంచించాడని, ఇంత నమ్మక ద్రోహాన్ని తామెప్పుడూ చూడలేదని ఆవేదన చెందుతున్న అన్నదాతలు ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతున్నారు.

ఎందుకిస్తలేరో నాకర్థమైతలేదు

భీమదేవరపల్లి: రుణమాఫీ ఇవ్వడానికి నాకు అర్హత లేదా.. లేక కావాలని ఇస్తలేరా.. నాకైతే అస్సలు అర్థమైత లేదు. నేను ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘంలో సభ్యుడిని. నాకు 4.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పట్టాదారు పాసుబుక్కు, సంఘంలో పేరులో తప్పు దొర్లిందని రుణమాఫీ రాలేదు. దీంతో సవరించి పంపించాను. రుణమాఫీ డబ్బులు వస్తే కాసింత అప్పులు తీరుతాయి అని వేయి కళ్లతో ఎదురుసూత్తాన. తీరా జూత్తే ఇప్పుడు కూడా రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. ఎందుకని తెలుసుకుంటే నాకు పట్టాపాసు బుక్కు లేదని వచ్చింది. ఇదీ వీళ్ల రుణమాఫీ లీల.

– కాశిరెడ్డి ఆదిరెడ్డి, రైతు, ముత్తారం, భీమదేవరపల్లి

తడిసిన ధాన్యం.. రైతుల దైన్యం

పరకాల/శాయంపేట/వాజేడు/కన్నాయిగూడెం, డిసెంబర్ 2 : తుపాన్ ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో హనుమకొండ జిల్లా పరకాల, శాయంపేటతోపాటు ములుగు జిల్లా వాజేడు, కన్నాయిగూడెం మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయింది. పరకాల మార్కెట్ ఆవరణలో కాంటాలైన ధాన్యంతో పాటు కాం టాలకు సిద్ధంగా ఉన్న బస్తాలు, ఆరబోసిన వడ్లు తడిసిపోయాయి. మరికొందరు రైతులు తమ ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి కాపాడుకున్నారు. అలాగే, శాయంపేట మండలంలోని ఆరెపల్లి, శాయంపేట, పత్తిపాక, మైలారం తదితర గ్రామాల పరిధిలో కల్లాలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసింది. కన్నాయిగూడెంమండలంలో సాయంత్రం తేలికపాటి వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లోని వడ్ల రాశులపై రైతులు టార్పాలిన్లు, బరకాలు కప్పారు. ధాన్యంపై కప్పేందుకు ప్రభుత్వం నుంచి ఒక్క టార్పాలిన్ కూడా అందించలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాజేడులోనూ రైతులు ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు చేపట్టారు. దీనికి తోడు కోతకొచ్చిన వరి పంట కూడా తడుస్తున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తుపాన్ ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో వర్షం

పరకాల: వర్షానికి తడువకుండా ధాన్యంపై కప్పిన పరదాలు, (ఇన్‌సెట్) శాయంపేటలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

ఆ గదిలో ఏం జరిగింది?

- రిసార్ట్‌లో వాజేడు ఎస్సై ఆత్మహత్య
- యువతితో కలిసి వచ్చిన హరీశ్..
- సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని మృతి
- వ్యక్తిగతమా? ప్రేమ వ్యవహారమా?
- అనుమానాలు వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు

ఘటనా ప్రదేశాన్ని పరిశీలించి బయటకు వస్తున్న ఎస్పీ డాక్టర్ శబరీష్

ఎస్సై హరీశ్ (ఫైల్)

వాజేడు, డిసెంబర్ 2 : ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఫెరియాడో రిసార్ట్ గదిలో అసలేం జరిగింది? యువతితో రాత్రి నుంచి తెల్లారే వరకు ఉన్న ఎస్సై హరీశ్ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు? వ్యక్తిగత కారణంతోనా? లేక ప్రేమ వ్యవహారమా? అతడితో ఉన్న ఆ యువతి ఎవరు? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పోలీసు శాఖ నుంచి ఒత్తిడి లేదని, వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య ఎస్సై ఆత్మహత్య చేసుకున్నట్లు ములుగు ఎస్పీ ప్రకటించినా అనేక సందేహాలు చుట్టుముడుతున్నాయి. ఈ అనుమానలపై నిగ్గుతేల్చాలని హరీశ్ కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. వాజేడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న రుద్రారపు హరీశ్ (30) సోమవారం మండలంలోని మండపాక గ్రామ శివారు ఫెరియాడో రిసార్ట్స్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన సొంత గ్రామం జయ శంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం వెంకటేశ్వర్లపల్లి. పేద కుటుంబం నుంచి వచ్చిన హరీష్ 2020 బ్యాచ్‌కు చెందిన వాడు. తొలుత వాజేడు పోలీస్‌స్టేషన్‌లో శిక్షణ ఎస్సైగా విధులు నిర్వర్తించిన అనంతరం ఇదే మండలంలోని పేరూరు ఎస్సైగా, అనంతరం ములుగు ఎస్పీ ఆఫీసులో పనిచేశారు. ఆరు నెలల క్రితం వాజేడుకు ఎస్సైగా వచ్చిన హరీశ్ అనూహ్యంగా ఆత్మహత్యకు పాల్పడడం చర్చనీయాంశమైంది.

యువతితో కలిసి గది అద్దెకు తీసుకున్న ఎస్సై

ఆదివారం సాయంత్రం యువతితో కలిసి కారులో వచ్చిన ఎస్సై హరీశ్ ఫెరియాడో రిసార్ట్స్‌లో గది అద్దెకు తీసుకున్నారు. సోమవారం ఉదయం ఎస్సై రివాల్వర్‌తో కాల్చుకోగానే యువతి వెంటనే రిసార్ట్ నిర్వాహకులకు తెలుపగా, వారు వెళ్లి గది తలుపులు తెరిచి చూడగా ఎస్సై విగత జీవిగా పడి ఉన్నాడు. ఆ యువతి అతడిపై రోదించిన వీడియోలు బయటకు వచ్చాయి. ఈ నెల 14న ఎస్సైకి వేరే అమ్మాయితో నిశ్చితార్థం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో యువతితో కలిసి ఇక్కడ గది ఎందుకు అద్దెకు తీసుకున్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతి చెందిన ఎస్సై మెడ చుట్టూ చున్నీ చుట్టి ఉండడంతో ఎస్సైది హత్యా? లేక ఆత్మహత్యా? అనే సందేహం నెలకొంది. అయితే ఆ యువతితో ప్రేమ వ్యవహారం ఉందా? ఈక్రమంలోనే తను వేరే అమ్మాయిని పెళ్లి చేసుకుంటున్న విషయం యువతితో మాట్లాడాడా? ఆ సందర్భంగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగి ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లాంటి అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆ యువతి పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.